# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా..



News Portal Designing
Epaper Designing & Web Hosting
Vn Media
+91 8099779988
vntelugudaily@gmail.com




సంపుటి : 3 సంచిక : 283 శనివారం 21 ఫిబ్రవరి 2026 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# బీఆర్ఎస్ వ్యూహం ఏంటి?

- రాజ్యసభ ఎన్నికల బరిలో నిలుస్తారా? లేదా?
- ఆసక్తికరంగా రాజకీయ సమీకరణాలు
- పార్టీ అభ్యర్థిని బరిలో నిలుపుతారా లేదా అనే విషయంపై ఉత్కంఠ
- రాజ్యసభ ఎన్నికల్లో పార్టీలు విప్ జారీ చేసే అధికారం
- పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై స్పష్టమైన వైఖరి తెలిసే అవకాశం




హైదరాబాద్

రాజ్యసభ సభ్యుల ఎన్నిక విషయంలో బీఆర్ఎస్ ఏం చేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. పార్టీ తరఫున అసలు అభ్యర్థిని బరిలో నిలుపుతారా లేదా అన్నది తేలాల్సి ఉంది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల విషయంలో స్పష్టమైన వైఖరి తెలిసే అవకాశం ఉన్న తరుణంలో బీఆర్ఎస్ వ్యూహం ఎలా ఉంటుందన్నది చర్చనీయాంశమైంది. రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల ప్రకటన విడుదలైంది. తెలంగాణ నుంచి రెండు స్థానాలకు ఎన్నిక కోసం ఈ నెల 26న నోటిఫికేషన్ వెలువడనుంది. వచ్చే నెల 6న పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ఎలాంటి వ్యూహం అవలంభిస్తుందన్నది చర్చనీయాంశమైంది. శాసనసభలో గులాబీ పార్టీకి అధికారికంగా 37 మంది శాసన సభ్యులు ఉండగా, అందులో 10 మంది కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించారు. అయితే పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్‌కు దూరంగా ఉంటూ వస్తున్నారు. ఇటీవలి పురపాలక ఎన్నికల్లో బీఆర్?ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం పని చేశారు. ఆయన నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీలను బీఆర్ఎస్సే కైవసం చేసుకుంది.

ఫిరాయింపు ఎమ్మెల్యేల ఓట్లు మరింత కీలకం

అసెంబ్లీలోని 119 మంది ఓటు హక్కు వినియోగించుకుంటే రానున్న రాజ్యసభ ఎన్నికల్లో కోటా 40.66 అవుతుంది. అంటే ఒక్కో సీటు గెలుచుకునేందుకు 41 ఓట్లు అవసరం పడుతుంది. రెండు స్థానాలకు 82 మంది బలం కావాల్సి ఉంటుంది. రాజకీయ సమీకరణాలను పరిగణనలోకి తీసుకొని - మిగతా3లో

# జీఎస్టీ కౌన్సిల్ తరహాలో ఏఐ కౌన్సిల్



- ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి
- ఏఐ రంగంలో అపార అవకాశాలు ఉన్నాయని వ్యాఖ్య
- హైదరాబాద్‌లో ఏఐ రంగంలో పెట్టుబడి పెట్టాలని పిలుపునిచ్చిన రేవంత్ రెడ్డి
- యువతను ఏఐ-ఆధారిత భవిష్యత్తుకు సిద్ధం చేయాలి
- స్టార్టప్‌లకు మద్దతు కల్పించేందుకు జాతీయ ఏఐ నిధి ఏర్పాటు చేయాలి

హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వంలో ప్రత్యేక ఆర్టిఫిషియల్ (కృత్రిమ మేధ) ఇంటెలిజెన్స్ మంత్రిత్వ శాఖ అవసరమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభిప్రాయ పడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ పరిణామాలు పర్యవేక్షించేందుకు జాతీయ ఏఐ వార్ రూమ్ ఉండాలని ప్రతిపాదించిన సీఎం కేంద్రం అనుమతిస్తే హైదరాబాద్‌లోనే నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందన్నారు. ప్రపంచ స్థాయి పరిశోధనలకు ఊతమిచ్చే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యూనివర్సిటీని దేశంలో స్థాపించాలని సీఎం అన్నారు. దేశవ్యాప్తంగా ఏఐ ఆవిష్కరణలకు కేంద్రంగా నిలిచే ఏఐ స్టార్టప్ విలేజ్‌ను తెలంగాణలో ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ప్రపంచమంతటినీ ప్రభావితం చేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో భారత్ - మిగతా3లో



## చైనా, బంగ్లాలకు భారత్ చెక్

- 'చికెన్ నెక్' సమీపంలో ట్విన్ ట్యూబ్ అండర్ వాటర్ రోడ్
- రైల్ టన్నెల్- దేశంలోనే తొలిసారిగా నిర్మాణం
- భారత్ తొలి అండర్ వాటర్ రోడ్
- రైల్ టన్నెల్-36 కిలోమీటర్లలో 15.79 కిలోమీటర్లు బ్రహ్మపుత్ర నది అడుగునే
- రూ.18,662 కోట్లతో నిర్మాణానికి ప్రణాళికలు
- పచ్చజెండా ఊపిన కేంద్ర కేబినెట్

# గురుకులాల్లో క్రమం తప్పకుండా తనిఖీలు

- గురుకుల విద్యార్థుల సంక్షేమంపై తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం..
- డిటైల్డ్ ఎంక్వైరీ క్యాలెండర్ సిద్ధం చేయాలి
- జిల్లా షెడ్యూల్ ప్రకారం.. తనిఖీలు నిర్వహించాలి
- అధికారులు తీసుకున్న చర్యల వివరాలు వెంటనే తెలియజేయాలి




హైదరాబాద్

గురుకుల విద్యార్థుల సంక్షేమంపై తెలంగాణ సర్కార్ ప్రత్యేక దృష్టి సారించింది. గురుకులాల్లో క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలోనే నోడల్ అధికారుల నియామకానికి ఆదేశాలు జారీ చేసింది. డిటైల్డ్ ఎంక్వైరీ క్యాలెండర్ సిద్ధం చేయాలని సూచించింది. జిల్లా షెడ్యూల్ ప్రకారం.. తనిఖీలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ఆకస్మిక సందర్శనలతో పాటూ పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని రేవంత్‌రెడ్డి సర్కార్ నిర్ణయం తీసుకుంది. తనిఖీ నివేదికలను వెంటనే - మిగతా3లో

## ఏఐ ఫలాలను ప్రతి ఒక్కరికి, ప్రతిచోటుకు చేరవేద్దాం



- భారత్, అమెరికా టెక్ భాగస్వామ్యం కీలకం
- సముద్ర గర్భ కేబుల్స్‌కు గేట్‌వేగా విశాఖపట్టణం
- రూ.1.36 లక్షల కోట్లతో వైజాగ్‌లో ఫుల్ స్టాక్ ఏఐహబ్
- గూగుల్ ఫీచర్ల వినియోగం భారత్‌లోనే ఎక్కువ
- ఏఐ సమ్మిట్‌లో గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ కీలక ప్రకటనలు



## ఈసీకి సహాయం చేయడానికి జ్యుడిషియల్ అధికారులను నియమించాలి

- సుప్రీం కోర్టు ఆదేశం
- ఎస్ఐఆర్ ప్రక్రియలో ఈసీకి సాయం అందించేందుకు జ్యుడీషియల్ అధికాలను నియమించాలన్న సుప్రీంకోర్టు
- ఈ మేరకు కోల్‌కతా హైకోర్టుకు సూచన
- ఫిబ్రవరి 28వ తేదీ నాటికి ఓటరు జాబితా ముసాయిదాను ప్రచురించేందుకు అనుమతి

# కవిత పార్టీ టీపీజేపీ?



- మే మొదటి వారంలో ముహూర్తం చూసుకుని పార్టీ పేరు ప్రకటిస్తామని, పార్టీ పేరులో తెలంగాణ ఉంటుందని కూడా హింట్ ఇచ్చారామె
- అంతేకాదు వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని.. నా మొదటి ఛాయిస్ సిద్ధిపేట.. రెండో ఛాయిస్ బోధన్ అని కవిత చెప్పారు
- ఈ క్రమంలో కవిత పార్టీ పేరు ఇదే అన్న ప్రచారం జరుగుతోంది
- కవిత తన పార్టీ పేరును టీపీజేపీగా నిర్ణయించినట్లు తెలుస్తోంది

హైదరాబాద్

ఈ ఏడాది మేలో కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించిన సంగతి తెలిసిందే. మే మొదటి వారంలో ముహూర్తం చూసుకుని పార్టీ పేరు ప్రకటిస్తామని, పార్టీ పేరులో తెలంగాణ ఉంటుందని కూడా హింట్ ఇచ్చారామె. అంతేకాదు వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని.. నా మొదటి ఛాయిస్ సిద్ధిపేట.. రెండో ఛాయిస్ బోధన్ అని కవిత చెప్పారు. ఈ క్రమంలో కవిత పార్టీ పేరు ఇదే అన్న ప్రచారం జరుగుతోంది. కవిత తన పార్టీ పేరును టీపీజేపీగా నిర్ణయించినట్లు తెలుస్తోంది.తెలంగాణ ప్రజా జాగృతి పార్టీగా నామకరణం చేసినట్లుగా సమాచారం. తన పార్టీ పేరులో తెలంగాణ ఉంటుందని చెప్పిన కవిత.. - మిగతా3లో

## టోల్ ప్లాజాల్లో నగదు చెల్లింపులు బంద్

- ఏప్రిల్ 1 నుంచి కొత్త విధానం!
- ఏప్రిల్ 1 నుంచి టోల్ ప్లాజాల్లో నగదు చెల్లింపుల రద్దుకు ప్రతిపాదన
- ఇకపై ఫాస్టాగ్, యూపీఐ ద్వారా మాత్రమే టోల్ రుసుముల వసూలు
- 98 శాతానికి పైగా ఫాస్టాగ్ వినియోగంతో డిజిటల్ చెల్లింపుల వైపు మొగ్గు
- ట్రాఫిక్ జామ్‌ల తగ్గింపు, సమయం ఆదా లక్ష్యంగా కేంద్రం కీలక నిర్ణయం



## టోల్ ప్లాజాల్లో నగదు చెల్లింపులు బంద్




జాతీయ రహదారులపై ప్రయాణించే వారికి ఇది అత్యంత కీలకమైన అప్‌డేట్. దేశవ్యాప్తంగా ఉన్న టోల్ ప్లాజాల్లో నగదు రూపంలో రుసుము చెల్లించే విధానానికి స్వస్తి పలకాలని కేంద్ర ప్రభుత్వం గట్టిగా యోచిస్తోంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే, 2026 ఏప్రిల్ 1వ తేదీ నుంచి టోల్ ప్లాజాల వద్ద నగదు చెల్లింపులు పూర్తిగా రద్దు కానున్నాయి. ఆ తర్వాత టోల్ రుసుములను కేవలం ఫాస్టాగ్ లేదా యూపీఐ వంటి డిజిటల్ మార్గాల ద్వారానే చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ సంకేతాలు ఇచ్చింది. ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి, టోలింగ్ ప్రక్రియను అత్యంత సమర్థవంతంగా, పారదర్శకంగా మార్చడమే ఈ ప్రతిపాదన ముఖ్య ఉద్దేశమని ప్రభుత్వం స్పష్టం చేసింది. గత కొన్నేళ్లుగా ఫాస్టాగ్ వినియోగం అనూహ్యంగా పెరిగింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 98 శాతానికి పైగా వాహనదారులు ఫాస్టాగ్ ద్వారానే టోల్ చెల్లిస్తున్నారు. ఈ విజయమే నగదు రహిత విధానం వైపు అడుగులు వేయడానికి ప్రభుత్వానికి ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. ఫాస్టాగ్‌తో పాటు, దేశంలోని అన్ని టోల్ ప్లాజాల్లో యూపీఐ ద్వారా చెల్లించే సౌకర్యం కూడా అందుబాటులో ఉంది. ఇది ప్రయాణికులకు తక్షణ చెల్లింపునకు మరో మార్గాన్ని అందిస్తోంది. ప్రస్తుతం, వాహనం విండ్‌స్క్రీన్‌పై అతికించిన ఫాస్టాగ్ స్టిక్కర్ ద్వారా టోల్ ప్లాజా వద్ద ఆగకుండానే రుసుము ఆటోమేటిక్‌గా ఖాతా నుంచి కట్ అవుతోంది. ఈ విధానం దేశంలోని అన్ని జాతీయ రహదారులతో పాటు, 100కి పైగా రాష్ట్ర రహదారుల టోల్ ప్లాజాల్లో విజయవంతంగా అమలవుతోంది. ఇప్పటికే ప్రభుత్వం డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఫంక్షనల్ ఫాస్టాగ్ ఉండి కూడా నగదు చెల్లిస్తే రెట్టింపు రుసుము, యూపీఐ ద్వారా చెల్లిస్తే 1.25 రెట్లు రుసుము వసూలు చేస్తున్నారు. తాజా ప్రతిపాదన అమలైతే, టోల్ ప్లాజాల వద్ద వాహనాల రద్దీ, ట్రాఫిక్ జామ్‌లు గణనీయంగా తగ్గుతాయి. ప్రయాణికులకు విలువైన సమయం ఆదా అవుతుంది. టోల్ ఆపరేటర్లకు నిర్వహణ ఖర్చులు తగ్గడంతో పాటు, టోల్ వసూళ్లలో ఆడిట్ నియంత్రణ మరింత సులభతరం అవుతుంది. నగదుపై ఆధారపడటాన్ని పూర్తిగా తగ్గించి, టోలింగ్ వ్యవస్థను 100 శాతం డిజిటలైజ్ చేయడమే లక్ష్యమని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ తెలిపింది. ఈ ప్రతిపాదనకు ఆమోదముద్ర పడితే, 2026 ఏప్రిల్ నుంచి జాతీయ రహదారులపై ప్రయాణం పూర్తిగా క్యాష్‌లెస్ అనుభవంగా మారనుంది.

## ఈసీకి సహాయం చేయడానికి జ్యుడిషియల్ అధికారులను నియమించాలి



బంగాల్‌లో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)పై సుప్రీం కోర్టు అసాధారణ నిర్ణయం తీసుకుంది. ఎన్నికల కమిషన్‌కు సహాయం చేయడానికి జిల్లా ప్రస్తుత, మాజీ న్యాయమూర్తులను నియమించాలని కోల్‌కతా హైకోర్టును ఆదేశించింది. ఈ వ్యవహారంపై ఈసీ, బంగాల్ ప్రభుత్వం పరస్పరం ఆరోపణలు చేసుకోవటం దురదృష్టకరమని పేర్కొంది. బంగాల్ ప్రభుత్వం తగిన సంఖ్యలో గ్రేడ్–ఎ అధికారులను నియమించకపోవటాన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్య బాగ్చి సారథ్యంలోని ధర్మాసనం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.
అదేవిధంగా, ఈనెల 28వ తేదీ నాటికి ఓటరు జాబితా ముసాయిదాను ప్రచురించేందుకు అనుమతి ఇచ్చింది. అనుబంధ ఓటరు జాబితా తర్వాత ప్రకటించాలని సూచించింది. ఎస్ఐఆర్‌లో పాల్గొనే జ్యుడీషియల్ అధికారులకు రవాణా సదుపాయంతోపాటు భద్రత కల్పించాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు ఆదేశాలు జారీ చేసింది.

## పెళ్లి అయ్యే వరకు ఫోన్ మాట్లాడంపై నిషేధం-వధూవరులిద్దరికీ ఆ కమ్యూనిటీ వింత షరతు!

ప్రస్తుత కాలంలో పెళ్లి కుదిరిందంటే చాలు కాబోయే వధూవరులిద్దరూ ఫోన్‌లో ముచ్చట్లు మొదలుపెట్టేస్తున్నారు. వివాహానికి ముందే అన్ని విషయాలను పంచుకుంటున్నారు. అందుతో తమ వ్యక్తిగత, కుటుంబ విషయాలు కూడా ఉంటున్నాయి. ఈ క్రమంలో మనస్పర్థలు, అనుమానాలు, అపోహలతో చాలా మంది పెళ్లికి ముందే విడిపోతున్నారు. నిశ్చితార్థం (ఎంగేజ్‌మెంట్) అయినప్పటికీ వివాహం వరకు బంధం కొనసాగట్లేదు. ఈ నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్‌లో సేన్ కమ్యూనిటీ (సమాజం) కీలక నిర్ణయం తీసుకుంది. తమ సామాజిక వర్గానికి చెందిన వధువరూలిద్దరూ నిశ్చితార్థం తర్వాత తమకు కాబోయేవారితో ఫోన్ మాట్లాడడంపై నిషేధం విధించింది.

### ఏకగ్రీవంగా నిర్ణయం

నిశ్చితార్థం తర్వాత చాలా పెళ్లిళ్లు ఆగిపోవడాన్ని బలోద్ జిల్లాలోని సేన్ కమ్యూనిటీ చాలా సీరియస్‌గా తీసుకుంది. ఈ క్రమంలోనే నిశ్చితార్థం అయిన తర్వాత పెళ్లి వరకు తమకు కాబోయే భాగస్వామితో వధూవరులిద్దరూ రహస్యంగా ఫోన్‌లో మాట్లాడకూడదని నిర్ణయించింది. కాబోయే భర్త లేదా భార్యతో కుటుంబ సభ్యుల సమక్షంలో మాట్లాడొచ్చని స్పష్టం చేసింది. కాబోయే భార్యాభర్తలు ఒకరితో ఒకరు రహస్యంగా ఫోన్‌లో మాట్లాడడంపై నిషేధం విధించింది. ఈ మేరకు సేన్ కమ్యూనిటీ ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుంది. ఆధునిక యుగంలో ఫోన్లు కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తున్నాయని సేన్ కమ్యూనిటీ బరోద్ జిల్లా అధ్యక్షుడు సంతోష్? కౌశిక్ అభిప్రాయపడ్డారు. అందుకే మళ్లీ పాత విధానాలను అనుసరిస్తున్నామని పేర్కొన్నారు. నిశ్చితార్థం అయిన తర్వాత వివాహం వరకు కాబోయే వధూవరులిద్దరూ ఫోన్‌లో రహస్యంగా మాట్లాడకూడదని నిర్ణయించామని తెలిపారు. ఇటీవల కాలంలో తమ సామాజిక వర్గానికి చెందిన నిశ్చితార్థమైన చాలా జంటలు పెళ్లికి ముందే విడిపోయానని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మొబైల్ ఫోన్‌లో గంటల తరబడి మాట్లాడటం వల్ల కుటుంబ సంబంధాలు దెబ్బతింటున్నాయని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు.

### 'నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం'

తమ సామాజిక వర్గం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నానని సేన్ కమ్యూనిటీ కార్యదర్శి సీమా కౌశిక్ తెలిపారు. సుదీర్ఘమైన ఆలోచనల తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. "నిశ్చితార్థం తర్వాత మొబైల్ ఫోన్‌లలో మాట్లాడే ధోరణి సేన్ కమ్యూనిటీలో అనేక సంఘటనలకు దారితీసింది. చాలా మంది యువతీయువకులు నిశ్చితార్థం చేసుకున్నప్పటికీ, ఆ బంధం పెళ్లి వరకు వెళ్లలేదు" అని సీమా కౌశిక్ అభిప్రాయపడ్డారు.

# చైనా, బంగ్లాలకు భారత్ చెక్

ఒకే ఒక్క కీలక ప్రాజెక్టుతో చైనా, బంగ్లాదేశ్‌లకు భారత్ చెక్ పెట్టబోతోంది. దేశంలోనే తొలిసారిగా అసోంలోని బ్రహ్మపుత్ర నది కింద ట్విన్ ట్యూబ్ అండర్ వాటర్ రోడ్ అండ్ రైల్ టన్నెల్ నిర్మాణానికి భారత్ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మన దేశ భద్రతకు ఈ ప్రాజెక్టు అత్యంత కీలకమైంది. ఇటీవలే ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) మోడల్ కింద దాదాపు రూ.18,662 కోట్లతో ఈ టన్నెల్ ప్రాజెక్టును నిర్మించనున్నారు. పొరుగున ఉన్న చైనా, బంగ్లాదేశ్ నుంచి వచ్చే ముప్పులను ఎదుర్కోవడానికి ఇదెలా సహాయపడుతుంది ? ఈ ప్రాజెక్టు వల్ల బార్డర్‌లో భారత ఆర్మీ బలం ఎంతమేర పెరుగుతుంది? సిలిగురి కారిడార్ (చికెన్ నెక్ కారిడార్) భద్రతను ఈ టన్నెల్ ఎలా బలోపేతం చేస్తుంది? ఈశాన్య రాష్ట్రాలకు కలిగే ప్రయోజనాలేంటి? ఈ కథనంలో తెలుసుకుందాం.

### 36 కి.మీ.లో 15.79 కిలోమీటర్లు నది అడుగునే

ట్విన్ ట్యూబ్ అండర్ వాటర్ రోడ్ అండ్ రైల్ టన్నెల్ అంటే రెండు టన్నెల్స్ పక్కపక్కనే ఉంటాయి. ఒక టన్నెల్‌లోని రైలుపట్టాల మీదుగా రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. మరొక టన్నెల్‌లోని రోడ్డు మీదుగా వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. బంగాల్ రాష్ట్రంలో ఉత్తర దినాజ్‌పూర్ జిల్లాలోని తీన్ మిలే హాత్ నుంచి డార్జిలింగ్ జిల్లాలోని సిలిగురి నగరానికి 11 కిలోమీటర్ల దూరంలోని రంగపాణి పట్టణం వరకు 36 కిలోమీటర్ల పరిధిలో ట్విన్ ట్యూబ్ టన్నెల్‌ను నిర్మించనున్నారు. ఈ టన్నెల్ రోడ్డు, రైలు మార్గాల్లో బంగాల్‌తో అసోం, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, ఇతర ఈశాన్య రాష్ట్రాలను కనెక్ట్ చేస్తుంది. కీలకమైన విషయం ఏమిటంటే, ఈ సొరంగంలోని మొత్తం 36 కిలోమీటర్ల విస్తీర్ణంలో 15.79 కిలోమీటర్ల విభాగాన్ని అసోం రాష్ట్రంలో బ్రహ్మపుత్ర నది కింద నీటి అడుగున నిర్మిస్తారు. అసోంలో బ్రహ్మపుత్ర నది ఉత్తరం ఒడ్డున ఉన్న గోహ్‌పుర్ పట్టణం నుంచి బ్రహ్మపుత్ర నది దక్షిణం ఒడ్డున ఉన్న నుమాలీఘర్ వరకు నది కింద అండర్ వాటర్ టన్నెల్ నిర్మాణం జరగనుంది.

### రెండు జాతీయ రహదారులు, రెండు రైల్వే లైన్లు అనుసంధానం

రోడ్ అండ్ రైల్ టన్నెల్ నిర్మించనున్న 36 కిలోమీటర్ల మార్గంలో ప్రస్తుతమున్న రెండు ట్రాక్‌ల రైల్వే లైన్‌ను నాలుగు ట్రాక్‌లుగా మారుస్తారు. ఈ టన్నెల్ ప్రాజెక్టు ఎన్‌హెచ్–15, ఎన్‌హెచ్–715 జాతీయ రహదారులతో పాటు, రెండు రైల్వే లైన్లకు కలుపుతుంది. నార్త్ ఈస్ట్ ఫ్రాంటియర్ రైల్వే జోన్ పరిధిలోని రంగియా డివిజన్‌లో గోహ్‌పుర్ వైపునున్న రంగియా–ముకోంగ్సెలెక్ రైల్వే లైన్, తీన్‌సుకియా డివిజన్‌లో



నుమాలీఘర్ వైపునున్న ఫుర్కేటింగ్–మరియాని లూప్ లైన్‌లను ఈ ప్రాజెక్టు కనెక్ట్ చేస్తుంది.

### 240 కి.మీ దూరం 34 కి.మీకు తగ్గిపోతుంది!

ప్రస్తుతం జాతీయ రహదారి మార్గంలో అసోంలోని నుమాలీఘర్ – గోహ్‌పుర్ పట్టణాల మధ్య 240 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ దూరాన్ని వాహనంలో ప్రయాణించడానికి సగటున 6 గంటల టైం పడుతుంది. అండర్ వాటర్ రోడ్, రైల్ టన్నెల్ అందుబాటులోకి వచ్చాక నుమాలీఘర్, గోహ్‌పుర్ మధ్య కేవలం 34 కిలోమీటర్ల దూరమే ఉంటుంది. నుమాలీఘర్ నుంచి గోహ్‌పుర్‌కు 20 నిమిషాల్లోనే వెళ్లొచ్చు.

### బ్రహ్మపుత్ర తీరప్రాంతం దశ తిరుగుతుంది!

అసోంలోని నుమాలీఘర్ అనేది ప్రధాన పారిశ్రామిక కేంద్రం. నుమాలీఘర్ రిఫైనరీ లిమిటెడ్ అనే ప్రభుత్వరంగ చమురు కంపెనీ అక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. నుమాలీఘర్, గోహ్‌పుర్‌ల మధ్య రైల్, రోడ్ కనెక్టివిటీ పెరిగితే అసోం రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు, వ్యాపార వికాసం రెక్కలు తొడుగుతాయి. అండర్ వాటర్ రోడ్, రైల్ టన్నెల్ అనేది అసోంలోని 11 ఆర్థిక కేంద్రాలు, 3 సామాజిక కేంద్రాలు, 2 పర్యాటక కేంద్రాలు, 8 లాజిస్టిక్స్ కేంద్రాలను కలుపుతుంది. రాష్ట్రంలోని 4 ప్రధాన రైల్వే స్టేషన్లు, 2 విమానాశ్రయాలు, 2 లోతట్టు జలమార్గాలకు మెరుగైన కనెక్టివిటీని అందిస్తుంది. దీనివల్ల వస్తు,ఉత్పత్తులు, ప్రయాణికుల రాకపోకలు వేగవంతం అవుతాయి. మొత్తంమీద ఈ టన్నెల్ ప్రాజెక్ట్ అసోం పరిధిలో దాదాపు 80 లక్షల రోజుల ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలను సృష్టిస్తుంది. అసోం సహా ఈశాన్య రాష్ట్రాల్లో వరదలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వేగంగా సహాయక సామాగ్రిని, రెస్క్యూ టీమ్‌లను తరలించే వీలు కలుగుతుంది.

### చైనా, బంగ్లాదేశ్‌లకు చెక్– భారత సైన్యానికి కొత్తమార్గాలు

ట్విన్ ట్యూబ్ అండర్ వాటర్ రోడ్ అండ్ రైల్ టన్నెల్ బంగ్లాదేశ్ సరిహద్దులోని రెండు సైనిక స్థావరాల దాకా వెళు ుంది. ఆ స్థావరాలకు శరవేగంగా సైనికులు, ఆయుధాలను చేరవేసే వీలు కలుగుతుంది.
బంగ్లాదేశ్ సరిహద్దు సమీపంలో మరో మూడు కొత్త సైనిక స్థావరాలను భారత సైన్యం నిర్మిస్తోంది. వీటిలో ఒకటి బిహార్‌లోని కిషన్‌గంజ్‌లో, మరొకటి బంగాల్‌లోని చోప్రాలో, ఇంకొకటి అసోంలోని ధుబ్రిలో ఉన్నాయి.
వీటికి చేరువగా ఈ రైలు–రోడ్డు మార్గం వెళుతుంది. నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్‌ల అంతర్జాతీయ సరిహద్దులు ఈ రైలు–రోడ్డు సొరంగ మార్గానికి చాలా దగ్గరగా ఉంటాయి. సైనిక ఘర్షణలు తలెత్తితే, ఈ టన్నెల్ మార్గంలో వేగంగా మూడు దేశాల సరిహద్దుల సమీపం వరకు భారత్ ఆయుధాలు, సైనికులను తరలించగలదు.
బంగాల్‌లోని సిలిగురి కారిడార్‌ను చికెన్ నెక్ కారిడార్ అంటారు. ఇది నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్, చైనాలోని చుంబీ లోయలకు అత్యంత సమీపంలో ఉంటుంది. సిలిగురి నగరం పరిధిలోని బాగ్ డోగ్రా విమానాశ్రయం సమీపం నుంచే ఈ టన్నెల్‌ను నిర్మించనున్నారు.
బంగాల్‌లోని సిలిగురి సమీపంలోనే భారత సైన్యానికి బెంగ్ డుబి సైనిక స్థావరం ఉంది. సిలిగురి కారిడార్ భద్రతకు ఇది కీలకమైంది. ఈ సైనిక స్థావరానికి కూడా చేరువగానే రోడ్ – రైల్ టన్నెల్ ఉంటుంది
బంగాల్‌లోని సుక్నాలో భారత ఆర్మీకి చెందిన 33వ కార్ప్స్ ప్రధాన కార్యాలయం ఉంది. దీన్నే త్రిశక్తి కార్ప్స్ అంటారు. ఇది కూడా టన్నెల్‌కు చేరువగానే ఉంటుంది. అత్యవసరాలు, యుద్ధ పరిస్థితుల్లో త్రిశక్తి కార్ప్స్ దళాలు ఈ టన్నెల్ మీదుగా రైళ్లు, వాహనాల ద్వారా సరిహద్దుల దాకా చేరుకోగలుగుతారు.
ప్రపంచంలో నీటి అడుగున రైల్వే సొరంగాలు ఎక్కడున్నాయి? డెన్మార్క్, స్వీడన్ దేశాలు భారత్ కంటే ముందే నీటి అడుగున రోడ్ కమ్ రైల్ టన్నెల్‌ను నిర్మించాయి. నీటి అడుగున నిర్మించిన అతి పొడవైన రైల్వే సొరంగంగా ఓరెసుండ్ టన్నెల్ రికార్డును సాధించింది. దీని మొత్తం పొడవు 16 కి.మీ. ఇందులో దాదాపు 4 కి.మీ భాగాన్ని సముద్రం కింద నిర్మించారు. ఈ టన్నెల్ డెన్మార్క్‌లోని కోపెన్ హగెన్ నగరాన్ని, స్వీడన్‌లోని మాల్మో నగరంతో అనుసంధానిస్తుంది. 2000 సంవత్సరంలోనే దీని నిర్మాణం పూర్తయింది. ఈ టన్నెల్‌లో మొత్తం 5 ట్యూబ్‌లు ఉన్నాయి. వీటిలోని రెండు ట్యూబ్‌లలో నాలుగు లేన్ల రోడ్లు ఉన్నాయి. మిగతా రెండు ట్యూబ్‌లలో రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. ఇంకొక ట్యూబ్‌లను అత్యవసరాల కోసం సిద్ధంగా ఉంచారు. ఈ సొరంగంలో వెంటిలేషన్, లైటింగ్, అధునాతన సెక్యూరిటీ ఫీచర్స్ ఉన్నాయి. అసోంలో బ్రహ్మపుత్ర నది కింద టన్నెల్ నిర్మాణం పూర్తయ్యాక భారత్ పేరు కూడా డెన్మార్క్, స్వీడన్ లాంటి దేశాల సరసన చేరనుంది.

# ఏఐ ఫలాలను ప్రతి ఒక్కరికి, ప్రతిచోటుకు చేరవేద్దాం

'ఇది వేగవంతమైన పురోగతి, కొత్త ఆవిష్కరణల యుగం'అని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ అన్నారు. అయితే వీటితో అత్యుత్తమ ఫలితాలే వస్తాయని కచ్చితంగా చెప్పలేమని ఆయన అభిప్రాయపడ్డారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) లాంటి కొత్త ఆవిష్కరణలతో అత్యుత్తమ ఫలితాలను సాధించేందుకు అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏఐ ఫలాలు ప్రతి ఒక్కరికి, ప్రతిచోటుకు చేరేలా చేయాల్సిన బాధ్యత మనపై ఉందని సుందర్ పిచాయ్ పేర్కొన్నారు. అమెరికా సారథ్యంలోని టెక్ కూటమి 'పాక్స్ సిలికా'లో భారత్ చేరికపై దిల్లీలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్, అమెరికాల మధ్య టెక్ భాగస్వామ్యం అత్యంత కీలకమైందన్నారు. 'పాక్స్ సిలికా' కూటమిలోకి భారత్ చేరనున్న నేపథ్యంలో ఆ కూటమిలోని అన్ని దేశాలకు పిచాయ్ అభినందనలు తెలిపారు. అమెరికా సారథ్యంలోని 'పాక్స్ సిలికా' కూటమిలో చేరిక వల్ల ఏఐ టెక్నాలజీ, సెమీ కండక్టర్లు, అరుదైన ఖనిజ నిక్షేపాలతో ముడిపడిన అంతర్జాతీయ సప్లై చైన్లకు భద్రత, రక్షణ లభిస్తాయన్నారు.

### భారత ప్రభుత్వంతో కలిసి ఏఐ యాప్స్ తెస్తాం

'ఏఐ విభాగంలో భారత్ అసాధారణమైన భవిష్యత్తును చూడబోతోంది. ఇందుకోసం మేం కూడా పూర్తి సహకారాన్ని అందిస్తాం. కొత్త ప్రోడక్ట్స్, సామర్థ్యం పెంపు, మౌలిక వసతుల పెంపు ద్వారా చేయూతను అందిస్తాం. భారతీయ కస్టమర్లు, వ్యాపారాలు, డెవలపర్ల కోసం ఏఐ ప్రోడక్ట్స్, సాఫ్ట్‌వేర్లను తయారు చేసే దిశగా ప్రస్తుతం కసరత్తు చేస్తున్నాం. ఏఐ కోచ్ సాఫ్ట్‌వేర్ కోసం 22 గెమ్మా ఓపెన్ సోర్స్ లార్జ్ ల్యాంగ్వేజ్ మోడల్స్‌ను ఇప్పటికే విడుదల చేశాం' 'కొత్త ఏఐ ప్రోడక్ట్స్ అభివృద్ధి విషయంలో మేం భారత ప్రభుత్వంతోనూ కలిసి



పనిచేస్తున్నాం. రైతులకు సకాలంలో వాతావరణ సూచనలను అందించే, రోగుల్లో డయాబెటిక్ రెటినోపతిని గుర్తించే ఏఐ యాప్‌లను ప్రభుత్వంతో కలిసి తీసుకురాబోతున్నాం.వీలైనన్ని ఎక్కువ భారతీయ భాషల్లో ఈ యాప్‌లు అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నాం' అని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ తెలిపారు.

### ఆ ఫీచర్లను భారత్‌లోనే ఎక్కువ వినియోగిస్తున్నారు

'సర్కిల్ టు సెర్చ్, లెన్స్ లాంటి గూగుల్ స్కామ్ డిటెక్షన్ ఫీచర్లను ప్రపంచంలో ఎక్కువగా భారత్‌లోనే వినియోగిస్తున్నారు. జెమిని యాప్ వినియోగం యావత్ ప్రపంచంలో శరవేగంగా పెరుగుతోంది. ఆ యాప్ 10 భారతీయ భాషల్లో అందుబాటులో ఉంది. ఎంతోమంది భారతీయ కంటెంట్ క్రియేటర్లు యూట్యూబ్ ద్వారా ప్రపంచానికి భారతీయ సంగీతం, కళలు, సంస్కృతిని చూపిస్తున్నారు' 'భారతీయులకు ఏఐ స్కిల్స్‌ను నేర్పడంపైనా మేం ఫోకస్ పెట్టాం. ఇందుకోసం గూగుల్ ఏఐ స్కిల్స్ ప్రోగ్రాం నడుస్తోంది. కోటిమంది భారతీయులకు ఏఐ టూల్స్‌పై అవగాహన కల్పించాలని మేం టార్గెట్‌గా పెట్టుకున్నాం. విద్యార్థులు, కొత్తగా టెక్ ప్రొఫెషన్స్‌లోకి ఎంటరయ్యే వారికి గూగుల్ ఏఐ సర్టిఫికెట్లను జారీ చేసేందుకు మేం వాధ్వానీ ఏఐ కంపెనీతో కలిసి పనిచేస్తున్నాం. ఈ వారం ఆరంభంలోనే దీనిపై నిర్ణయం జరిగింది' అని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ చెప్పారు.

### సముద్ర గర్భ ఫైబర్ ఆప్టిక్ కేబుల్స్‌కు గేట్‌వేగా విశాఖపట్టణం

'భారత్‌లోనే తొలి ఫుల్ స్టాక్ ఏఐ హబ్‌ను ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్‌లో ఏర్పాటు చేయబోతున్నాం. ఇందుకోసం రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడి పెడతాం. ఆ ఏఐ హబ్ సామర్థ్యం గిగావాట్ల స్థాయిలో ఉంటుంది. దానివల్ల దేశవ్యాప్తంగా ప్రజలకు ఉద్యోగాలు, ఏఐ టెక్నాలజీ ఫలాలు, కొత్త వ్యాపార అవకాశాలు లభిస్తాయి. భారత్, అమెరికాల మధ్య డిజిటల్ ట్రేడ్ రూట్ల ఏర్పాటులోనూ గూగుల్ కీలక పాత్ర పోషిస్తుంది. ఇరుదేశాల నడుమ వారధిగా పనిచేస్తుంది. అందుకోసం విశ్వసనీయమైన డిజిటల్ ప్రోడక్ట్స్, సముద్రగర్భ కేబుల్స్, ఏఐ హబ్‌లు అవసరం' 'ఇండియా– అమెరికా కనెక్ట్ కార్యక్రమాన్నీ మేం ఇప్పటికే ప్రకటించాం. దీనిలో తొలి ప్రధాన అంతర్జాతీయ సముద్ర గర్భ గేట్‌వేగా విశాఖపట్నం నిలుస్తుంది. వైజాగ్ నుంచి సింగపూర్, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా దేశాల వరకు సముద్ర గర్భ ఫైబర్ ఆప్టిక్ కేబుల్స్ కనెక్ట్ అవుతాయి. ముంబయి టు పశ్చిమ ఆస్ట్రేలియా వరకూ సముద్ర గర్భ కేబుల్స్ ఏర్పాటు అవుతాయి. కొత్తగా అమెరికా ఏర్పాటు చేసిన పాక్స్ సిలికా కూటమి ఈవిధమైన సప్లై చైన్ల భద్రతకు హామీ ఇస్తోంది' అని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ వివరించారు.

# రిటైర్ అవుతారా? రిటర్న్ అవుతారా?- రాజ్యసభ పోల్స్ వేళ శరద్ పవార్ ప్లాన్ ఏంటి?

మహారాష్ట్ర రాజకీయాల్లో మరో కీలక పరిణామం జరగబోతోందనే సంకేతాలు కనిపిస్తున్నాయి. లేదు లేదు, కాదు కాదు అంటూనే రాజ్యసభ ఎన్నికల బరిలోకి దిగేందుకు ఎన్‌సీపీ (ఎస్‌పీ) అధినేత శరద్ పవార్ రెడీ అవుతున్నారనే టాక్ వినిపిస్తోంది. రాష్ట్ర రాజకీయాల్లో విస్తృతమైన పరిచయాలతో పాటు సుదీర్ఘ అనుభవం, జాతీయ స్థాయిలో పేరు కలిగిన 85 ఏళ్ల శరద్ పవార్‌ను రాజ్యసభకు పంపాలని యోచిస్తోంది. మహారాష్ట్రలోని 7 రాజ్యసభ సీట్లకు మార్చి 16న ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రంలోని ఎమ్మెల్యేల సంఖ్యాబలం పరంగా మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటమి ఒకే ఒక్కరిని రాజ్యసభకు పంపగలుగుతుంది. ఆ ఒక్క అవకాశాన్ని శరద్ పవార్ పొందబోతున్నారనే చర్చ జరుగుతోంది. అయితే దీన్ని కాంగ్రెస్‌లోని ఓ వర్గం వ్యతిరేకిస్తోంది.

### వరుసగా మూడోసారి రాజ్యసభకు శరద్ పవార్

రాజ్యసభకు వెళ్లాలనే కోరిక తనకు లేదని శరద్ పవార్ ఇంతకుముందే పలుమార్లు స్పష్టం చేశారు. అయితే, అజిత్ పవార్ మరణంతో రాష్ట్ర రాజకీయ సమీకరణాలు మారిన దృష్ట్యా ఆయన రాజ్యసభకు వెళ్లేందుకు మొగ్గుచూపుతారనే అంచనాలు వెలువడుతున్నాయి. తన పార్టీ ఎన్‌సీపీ (ఎస్‌పీ) కోసం కాకుండా, ప్రతిపక్ష ఎంవీఏ కూటమి భవిష్యత్తు కోసం రాజ్యసభ ఎన్నికల బరిలోకి దిగేందుకు శరద్ పవార్ సిద్ధం అవుతున్నారనే ప్రచారం జరుగుతోంది. గత ఆరు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్న శరద్ పవార్, ఇప్పటివరకు కేవలం రెండుసార్లే రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. 2014లో భారత రాజకీయాల్లో బీజేపీ ప్రభంజనం మొదలయ్యాక, శరద్ పవార్ రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేయాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడింది. ఈవిధంగా 2014, 2020లో రాజ్యసభకు ఆయన ఎన్నికయ్యారు. ప్రస్తుతం రాజ్యసభ సభ్యుడిగా ఉన్న శరద్ పవార్ పదవీకాలం 2026 ఏప్రిల్?తో ముగియనుంది. దీంతో వరుసగా మూడోసారి ఆయన్ను రాజ్య సభకు పంపి, జాతీయస్థాయిలో ప్రతిపక్ష ఇండియా కూటమి వాణిని బలోపేతం చేయాలని విపక్షాలు భావిస్తున్నాయి. రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్‌ను ఫిబ్రవరి 18వ తేదీన కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. మహారాష్ట్రలో మొత్తం 288 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. రాజ్యసభ ఎన్నికల్లో ఒక సీటును గెలవాలంటే కనీసం 37 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. ప్రస్తుతం ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ కూటమిలో శరద్ పవార్ ఎన్‌సీపీ, కాంగ్రెస్, ఉద్ధవ్ శివసేన ఉన్నాయి. ఈ కూటమికి 50 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. అత్యధికంగా ఉద్ధవ్ శివసేనకు 20 మంది, కాంగ్రెస్‌కు 16 మంది, శరద్ ఎన్‌సీపీకి 10 మంది, సమాజ్ వాదీ పార్టీకి ఇద్దరు, పీజాంట్స్ అండ్ వర్కర్స్, సీపీఐ పార్టీలకు చెరొక ఎమ్మెల్యేలు ఉన్నారు. 7 రాజ్యసభ సీట్లకు ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో ఒకే ఒక సీటును గెలిచే బలం మహా వికాస్ అఘాడీ కూటమికి ఉంది. ఇటీవలి కాలంలో శరద్ పవార్ ఎన్‌సీపీ, బీజేపీ మధ్య పెరుగుతున్న సాన్నిహిత్యంపై రాజకీయ వర్గాల్లో హాట్ డిబేట్ నడుస్తోంది. శరద్ పవార్ ఎన్‌సీపీ భవిష్యత్తులో బీజేపీలో విలీనం అవుతుందనే ఆందోళన కాంగ్రెస్‌లోని ఒక వర్గం నేతల్లో వ్యక్తమవుతోంది. ఈ రాజ్యసభ ఎన్నికల్లో విపక్ష ఎంవీఏ కూటమికి లభించే ఒక్కగానొక్క రాజ్యసభ సీటును శరద్ పవార్‌కే కేటాయిస్తే,

# జీఎస్టీ కౌన్సిల్ తరహాలో ఏఐ కౌన్సిల్

-మొదటిపేజీ తరువాయి

ముందంజలో నిలవాలంటే కేంద్ర ప్రభుత్వంలో ప్రత్యేక ఏఐ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఏఐ వినియోగం, నియంత్రణ, చట్టపరమైన మార్గదర్శకాలు, జాతీయ భద్రత తదితర అంశాలను సమగ్రంగా నిర్వహించేందుకు ప్రత్యేక వ్యవస్థ అవసరమన్నారు. దిల్లీలో నిర్వహించిన ఏఐ సమ్మిట్‌లో ప్రసంగించిన సీఎం మానవ చరిత్రలో అగ్ని, చక్రం, వ్యవసాయం, విద్యుత్, ఇంటర్నెట్ వంటి ఆవిష్కరణలు ప్రపంచాన్ని ఎలా మార్చాయో గుర్తుచేశారు. ఏఐ కూడా అలాంటి విప్లవాత్మక సాంకేతికతేనని ఇది మానవ పరిణామ క్రమంలో అత్యంత శక్తివంతమైన మలుపని సీఎం అభివర్ణించారు.



### ఏఐ రోడ్‌మ్యాప్ అవసరం

మునుపటి యంత్రాల మాదిరిగా కాకుండా ఏఐ స్వయంగా నేర్చుకోగలదని, విశ్లేషించగలదని, నిర్ణయాలు తీసుకోగలదని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రోబోటిక్స్‌తో కలిసినప్పుడు యంత్రాలు మేధస్సుతో పాటు శారీరక సామర్థ్యాన్ని కూడా పొందుతున్నాయని అన్నారు. ప్రపంచ ఏఐ పోటీ ఇప్పటికే ప్రారంభమైందని కొన్ని దేశాలు, కంపెనీలు ముందంజలో ఉన్నాయని సీఎం చెప్పారు. పారిశ్రామిక విప్లవాల సమయంలో జరిగిన నష్టాలను గుర్తు చేస్తూ, ఈసారి భారత్ అలాంటి తప్పిదం చేయకూడదని హెచ్చరించారు. సేవలు, సాఫ్ట్‌వేర్ రంగాల్లో విజయం సాధించిన భారత్ ప్రపంచ స్థాయి కోర్ టెక్నాలజీ ఉత్పత్తుల్లో కూడా నాయకత్వం వహించాలన్నారు. దేశానికి తక్షణ జాతీయ ఏఐ రోడ్‌మ్యాప్ అవసరమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. సెమీకండక్టర్ చిప్ తయారీ, జీపీయూ సామర్థ్యాలు, డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ వినియోగం, ఏఐ ప్లాట్‌ఫామ్‌లు, అప్లికేషన్ల అభివృద్ధిలో భారత్ స్పష్టమైన వ్యూహంతో ముందుకు సాగాలని సూచించారు.

### ఏఐ వార్‌రూమ్ ఏర్పాటు చేయాలి

ప్రపంచవ్యాప్తంగా ఏఐ పరిణామాలను నిశితంగా పర్యవేక్షించేందుకు కేంద్రం--రాష్ట్రాల సమన్వయంతో జాతీయ ఏఐ వార్ రూమ్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. కేంద్రం అనుమతిస్తే హైదరాబాద్‌లోనే ఆ వార్ రూమ్ నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రపంచ స్థాయి పరిశోధనలకు ఊతమిచ్చే ఏఐ యూనివర్సిటీని దేశంలో స్థాపించాలని సూచించారు. ఏఐ విస్తరణ నేపథ్యంలో ఉపాధిపై తలెత్తుతున్న ఆందోళనలను ప్రస్తావిస్తూ కొన్ని రంగాల్లో ఉద్యోగ నష్టాలు సంభవించవచ్చునన్నారు. అయితే సరైన రీ-స్కిల్లింగ్, అప్-స్కిల్లింగ్ చర్యల ద్వారా ఏఐ వల్ల సృష్టించబడే కొత్త అవకాశాలు మరింత విస్తృతంగా ఉంటాయని అభిప్రాయపడ్డారు.

### మేం సిద్ధం

యువతను ఏఐ-ఆధారిత భవిష్యత్తుకు సిద్ధం చేయాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. స్టార్టప్‌లకు మద్దతు కల్పించేందుకు జాతీయ ఏఐ నిధి ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. దేశవ్యాప్తంగా ఏఐ ఆవిష్కరణలకు కేంద్రంగా నిలిచే ఏఐ స్టార్టప్ విలేజ్‌ను తెలంగాణలో ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఏఐ రంగంలో విధానాలు, చట్టాలు, నైతిక ప్రమాణాలకు మార్గనిర్దేశం చేసే అత్యున్నత సంస్థగా ఇండియా ఏఐ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రిని కోరారు. సామాజిక న్యాయం, పేదరిక నిర్మూలన, ప్రజా సేవల మెరుగుదల, జాతీయ భద్రతకు తోడ్పడేలా ఏఐ అభివృద్ధి ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బాధ్యతాయుతమైన, సమ్మిళిత, భవిష్యత్ దృష్టితో కూడిన ఏఐ వ్యవస్థను నిర్మించేందుకు ప్రపంచ నిపుణులు, సంస్థలు కలిసి పనిచేయాలని ఆయన కోరారు. ఈ మార్పు యుగంలో భారత్ నాయకత్వం వహించాల్సిన సమయం ఇదేనని సీఎం స్పష్టం చేశారు "ఏఐ రంగంలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగాలి. గ్రీన్ ఎనర్జీ, డేటా స్టోరేజ్, అప్లికేషన్స్‌లో మరింత అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉంది. కేంద్ర రాష్ట్రాల్లో ఏఐ అభివృద్ధిని పర్యవేక్షించేందుకు వార్?రూంను ఏర్పాటు చేయాలి. ఆ రంగంలో మరింత వృద్ధిని సాధించేందుకు వార్?రూం ఉపయోగపడుతుంది. హైదరాబాద్?లో ఏఐ వార్? రూం ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రదేశం. అంతర్జాతీయ ప్రమాణాలతో ఏఐ యూనివర్సిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఏఐ రంగంలో అగ్రగామిగా ఉండేందుకు జీపీయూ, చిప్స్?ల తయారీ యూనిట్లను ఏర్పాటు చేయాలి. జీఎస్టీ కౌన్సిల్ తరహాలో ఏఐ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలి."

# హైదరాబాద్‌లో హాట్ కేకుల్లా ప్లాట్లు..
## 14 ప్లాట్ల వేలంతో రూ.14.75 కోట్ల ఆదాయం

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో ప్లాట్లు హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి. హౌసింగ్ బోర్డు పరిధిలో ఉన్న ఓపెన్ ప్లాట్లకు నిర్వహించిన వేలంలో భారీ ధర పలికాయి. 14 ప్లాట్లను వేలం వేయగా.. ఏకంగా రూ.14.75 కోట్ల ఆదాయం సమకూరింది. చదరపు గజానికి కనీస ధర రూ.32 వేలు నిర్వహించగా.. గరిష్ఠంగా రూ.51 వేలకు విక్రయం అయినట్లు అధికారులు వెల్లడించారు. ఇక మరో విడత వేలం ఈనెల 23న నిర్వహించనున్నారు. శరవేగంగా డెవలప్ అవుతున్న హైదరాబాద్ మహా నగరంలో ఖాళీ ప్లాట్లు దొరకడమే గగనం అయిపోయింది. ప్లాట్లు కొనాలంటే నగర శివార్లకు వెళ్లాల్సిందే. అది కూడా భారీగా ధరలు పెట్టాల్సిందే. ఇక నగరం నడిబొడ్డున ప్లాట్లు కొనాలంటే కోట్ల రూపాయలు కుమ్మరించాల్సిందే. ఇక అప్పుడప్పుడూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే వేలంలో స్థలాలు అత్యధిక పలికి రికార్డుల్లోకి ఎక్కిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే హౌసింగ్ బోర్డు పరిధిలో ఉన్న ఖాళీ ప్లాట్లకు నోటిఫికేషన్ విడుదల చేసి.. తాజాగా వేలం నిర్వహించగా.. కళ్లు చెదిరే ఆదాయం వచ్చింది. హైదరాబాద్ నగర శివారు అయిన రాజేంద్ర నగర్ మండలంలో ఓపెన్ ప్లాట్లకు వేలం నిర్వహించారు. లక్ష్మీగూడలోని హౌసింగ్ బోర్డు ప్లాట్లను అమ్మకానికి పెట్టగా.. భారీ ఎత్తున స్పందన వచ్చినట్లు బోర్డు వైస్ ఛైర్మన్ వీపీ గౌతమ్ తాజాగా విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. అక్కడ ఉన్న 14 ప్లాట్లను తాజాగా బహిరంగ వేలం జరిపారు. ఈ ప్లాట్ల విక్రయించడానికి సంబంధించి ఈనెల 2వ తేదీన హౌసింగ్ బోర్డు నోటిఫికేషన్ రిలీజ్ చేసింది. బహిరంగ వేలం పాట నిర్వహించగా.. అందులో 49 మంది కొనుగోలుదారులు హాజరయ్యారు. మొదట ఈ భూములకు చదరపు గజానికి రూ.32 వేలను కనీస ధరగా హౌసింగ్ బోర్డు నిర్ణయించింది. ఇక వేలంలో అనూహ్యంగా చదరపు గజం ధర గరిష్టంగా రూ.51 వేలు పలికి అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ క్రమంలోనే ఏకంగా 14 ప్లాట్ల హాట్ కేకుల్లా విక్రయం అయ్యాయి. ఈ ప్లాట్లను అమ్మడం ద్వారా హౌసింగ్ బోర్డుకు రూ.14.75 కోట్ల ఆదాయం వచ్చినట్లు బోర్డు వైస్ ఛైర్మన్ వీపీ గౌతమ్ వెల్లడించారు. హౌసింగ్ బోర్డు సౌత్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆధ్వర్యంలో ఈ బహిరంగ వేలాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు. ఇక ఈ వేలంలో అతి తక్కువగా చదరపు గజానికి రూ.36 వేల ధర పలికింది. దీంతో సగటున ఒక్కో చదరపు గజం రూ.44,285కు విక్రయం అయినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మరోవైపు.. హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో పలు ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్లాట్లను వేలం వేయడానికి హౌసింగ్ బోర్డు ఇటీవలె నోటిఫికేషన్ విడుదల చేసింది. గచ్చిబౌలి, లింగంపల్లి, కూకట్‌పల్లి, చింతల్, కుత్బుల్లాపూర్, నిజాంపేట ప్రాంతాల్లో ఈ ప్లాట్లు ఉన్నట్లు వెల్లడించింది. భరత్ నగర్ మెట్రో స్టేషన్ వద్ద 1106 గజాలు.. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో 266 గజాలు.. బౌరంపేటలో 2,600 గజాలు, చింతల్ హౌసింగ్ బోర్డు కాలనీలో 6 ప్లాట్లు.. గచ్చిబౌలి హౌసింగ్ బోర్డు కాలనీలో 3 ప్లాట్లు, నిజాంపేటలో ఒక ప్లాటు ఉందని తెలిపారు. ఈ స్థలాలకు ఈనెల 23వ తేదీన వేలం నిర్వహించనున్నట్టు వీపీ గౌతమ్ తెలిపారు. వేలం రోజు ఉదయం నాటికి డీడీ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని స్పష్టం చేశారు.



# అదిలాబాద్‌కు కొత్త ఎయిర్ పోర్టు

**అదిలాబాద్ :** ఆదిలాబాద్ జిల్లా ప్రజల దశాబ్దాల కల నెరవేరబోతుంది. జిల్లాలో కొత్తగా ఎయిర్‌పోర్టు కానుంది. ఈ మేరకు ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు మాస్టర్ ప్లాన్‌ను ఎంపీ గోడం నగేష్ విడుదల చేశారు. త్వరలోనే భూసేకరణ పనులు ప్రారంభం అవుతాయని ఎంపీ వెల్లడించారు. ఈ ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తే జిల్లా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. తెలంగాణలో ప్రస్తుతం శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు మాత్రమే అందుబాటులో ఉంది. దీంతో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో మరికొన్ని ఎయిర్‌పోర్టులు ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్టు, కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్‌లలో కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్టు భూసేకరణ పనులు మె?దలయ్యాయి. తాజాగా.. ఆదిలాబాద్ విమానాశ్రయంపై కూడా కీలక అప్డేట్ వచ్చింది. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు మాస్టర్ ప్లాన్‌కు అనుమతి వచ్చిందని ఎంపీ గోడం నగేష్ వెల్లడించారు. త్వరలో భూసేకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ మేరకు ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి ఎయిర్‌పోర్టు మాస్టర్ ప్లాన్ ప్రతిని మీడియా ముందు విడుదల చేశారు. ఈ ప్రాంతంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు మరో 10 వేల ఎకరాల గుర్తింపునకు ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఎయిర్‌పోర్టు అథారిటీ అధికారులు రంగంలోకి దిగాక.. మాస్టర్ ప్లాన్‌లో కొంత మార్పులు కూడా జరిగే అవకాశం ఉందని చెప్పారు. జిల్లా అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు. అనంతరం సోషల్ మీడియాలోనూ ఈ విషయాలను వెల్లడించారు. 'ఆదిలాబాద్ విమానాశ్రయ మాస్టర్ ప్లాన్ ఆమోదం పొందింది. జిల్లా ప్రజలకు ఇది ఒక చారిత్రాత్మక మైలురాయి. దశాబ్దాలుగా ఈ ప్రాంతం ప్రజలు ఎయిర్ కనెక్టివిటీ కోసం ఎదురు చూస్తున్నారు. నేడు ఆ కల సాకారం కాబోతుంది. ఆదిలాబాద్ విమానాశ్రయ మాస్టర్ ప్లాన్‌ను ముందుకు తీసుకెళ్లాలనే ఆకాంక్ష నేడు కార్యరూపం దాల్చుతోంది. అధికారికంగా మాస్టర్ ప్లాన్ ఆమోదించారు. త్వరలోనే ఎయిర్‌పోర్టు నిర్మాణం పనులు ప్రారంభమవుతాయి. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అనేక రంగాల్లో ముందడుగు వేస్తోంది. మౌలిక సదుపాయాలకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వాటి ఫలితమే ఈ ముందడుగు. స్థానిక ప్రజల దీర్ఘకాల డిమాండ్‌ను నిజం చేయటం కోసం నిరంతర కృషి చేసిన కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్‌లకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ విమానాశ్రయం మౌలిక సదుపాయాల ప్రాజెక్టు కంటే ఎక్కువ. ఇది ఆదిలాబాద్ జిల్లాకు ఒక మలుపు. మా జిల్లాను ప్రధాన నగరాలకు అనుసంధానిస్తుంది, స్థానిక వ్యాపారాలు, రైతులకు మద్దతు ఇస్తుంది, మా గిరిజన, అటవీ ప్రాంతాలకు పర్యాటకాన్ని ప్రోత్సహిస్తుంది, కొత్త పెట్టుబడులను ఆకర్షిస్తుంది. ఆదిలాబాద్ యువతకు ఉపాధి అవకాశాలను సృష్టిస్తుంది.' అని గోడం నగేష్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు.



## బీఆర్ఎస్ వ్యూహం ఏంటి?

-మొదటిపేజీ తరువాయి

బీజేపీ పార్టీకి చెందిన 8 మంది ఎమ్మెల్యేలు ఓటింగ్‌కు దూరంగా ఉంటే, కోటా 38 అవుతుంది. రెండు స్థానాలకు 76 మంది బలం అవసరం అవుతుంది. కాంగ్రెస్‌కు ఉన్న 66 మందితో పాటు ఏడుగురు ఎంఐఎం, ఒక సీపీఐ సభ్యునితో కలిపి 74 మంది అవుతారు. రెండు సందర్భాల్లో రెండు సీట్లకు సరిపడా కోటా రాదు. కోటా రాకపోతే ద్వితీయ ప్రాధాన్య ఓట్లు, ఆ తర్వాత తొలగింపు ప్రక్రియ చేపట్టడంతో ఫిరాయింపు ఎమ్మెల్యేల ఓట్లు మరింత కీలకం అవుతాయి.

### ఏజెంట్‌కు ఓటు చూపాల్సిందే

రాజ్యసభ ఎన్నికకు రాజకీయ పార్టీ విప్ వర్తిస్తుంది. ఇదే సమయంలో ఎమ్మెల్యేలు తాము ఏ అభ్యర్థికి ఓటు వేసారనేది పార్టీ ఏజెంట్‌కు తప్పకుండా చూపాల్సి ఉంటుంది. అలా చూపకపోతే ఆ ఓటు విషయమై ఏజెంట్ తీవ్ర అభ్యంతరం చెప్పవచ్చు. గతంలో గుజరాత్‌లో ఇదే తరహాలో కాంగ్రెస్ నేత అహ్మద్ పటేల్ పోటీ చేసినప్పుడు ఇద్దరు ఎంపీలు ఏజెంట్‌కు ఓటు చూపనందుకు ఎన్నికల సంఘం వాటిని లెక్కింపులోకి తీసుకోలేదు. దీంతో రాజ్యసభ ఎన్నికలో పార్టీ ఏజెంట్‌కు చూపించి మరీ ఓటు వేయడం తప్పనిసరి అని అంటున్నారు.

### రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ

ఎవరికి ఓటు వేసినా పార్టీ తరఫు ఏజెంట్‌కు చూపిస్తేనే ఆ ఓటు చెల్లుబాటు అవుతుందని చెబుతున్నారు. తద్వారా ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఎటువైపు ఓటు వేసేది తేలిపోయే అవకాశం ఉంటుందని అంటున్నారు. రాజ్యసభ ఎన్నికల్లో గెలుపు ఓటములు ఎలా ఉన్నా, ఫిరాయింపు ఎమ్మెల్యేల వైఖరిని ఎండగట్టే అవకాశం ఉంటుందన్న చర్చ బీఆర్?ఎస్?లో నడుస్తోంది. పార్టీ అభ్యర్థిని బరిలో దింపి, విప్ జారీ చేస్తేనే అందుకు అవకాశం ఉంటుంది. ఈ పరిస్థితుల్లో గులాబీ పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు తెరలేపింది. ఈ ఎన్నికలతో పాటు త్వరలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కోసం ప్రకటన వెలువడనున్నట్లు తెలుస్తోంది. బీఆర్?ఎస్? నాయకులు ఈ ఎన్నికల్లో సత్తా చూపాలని వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారం.

## గురుకులాల్లో క్రమం తప్పకుండా తనిఖీలు

-మొదటిపేజీ తరువాయి

అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది. అధికారులు తీసుకున్న చర్యల వివరాలు వెంటనే తెలియజేయాలని హుకుం జారీ చేసింది. ప్రతి నెలా 5వ తేదీలోపు నివేదిక సమర్పణని తప్పనిసరి చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## కవిత పార్టీ టీపీజేపీ?

-మొదటిపేజీ తరువాయి

అన్నట్లుగానే ఇప్పుడున్న తెలంగాణ జాగృతి సంస్థను రాజకీయ పార్టీగా మార్చేస్తూ తెలంగాణ ప్రజా జాగృతి పార్టీగా నిర్ణయించారని తెలుస్తోంది. కార్మిక దినోత్సవం రోజైన మే 1న పార్టీ ఆవిర్భావ ప్రకటన చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇక పసుపు, ఎరుపు రంగుల్లో పార్టీ జెండాను రూపొందిస్తున్నట్లు సమాచారం. గతంలో టీడీపీ వెంట బీసీ ఓటు బ్యాంక్ ఉండేది. ఆ ఓటు బ్యాంక్ ను తనవైపు తిప్పుకునేలా పసుపు టచ్ ఇస్తున్నారని పొలిటికల్ వర్గాల్లో నడుస్తున్న చర్చ. ఇక పార్టీ గుర్తుగా కాగడా లేదా కళ్లజోడు గుర్తుపై కవిత ఫోకస్ చేశారు. వచ్చే ఎన్నికల్లో సిద్దిపేట, బోధన్.. ఈ రెండు చోట్ల నుంచి కవిత బరిలోకి దిగుతారనే టాక్ వినిపిస్తోంది. ఆర్టీసి కార్మికుల సమ్మె విషయంలో బీఆర్ఎస్ పట్టించుకోలేదనే కోపం కార్మికుల్లో ఉంది. బిల్లుల చెల్లింపు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కంటే బీఆర్ఎస్ ప్రభుత్వం నయం. రెండేళ్లలో ఆర్టీసీలో సింగిల్ పర్మినెంట్ రిక్రూట్మెంట్ లేదని కవిత అన్నారు. ఫ్యూచర్‌లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ఉండదని కవిత సంచలన కామెంట్స్ చేశారు. ప్రధాన ప్రతిపక్షం మేమే అవుతాం.. చూస్తూ ఉండండి అంటూ కవిత అన్నారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి మేమే వస్తామని, ప్రయారిటీల ఆధారంగా మేము సమస్యలపై పోరాటం చేస్తున్నామని కవిత చెప్పుకొచ్చారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తామని, జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లోనూ పోటీ చేస్తామని కవిత స్పష్టం చేశారు. మా పార్టీ నేతలు మున్సిపాలిటీల్లో గెలిచిన తరువాత వాళ్లకు ఫోన్లు చేసి ఒత్తిడి తెచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ దారిలోనే వెళ్తుంది. కొత్త తరహా రాజకీయం కాంగ్రెస్ చేయడం లేదని కవిత అన్నారు. నేను పెట్టబోయే పార్టీ వ్యక్తుల మీద నడవదు.. వ్యవస్థల మీద నడవాలి. ప్రాంతీయ పార్టీ లీడర్ సెంట్రిక్ ఉంటుంది. కానీ, వ్యవస్థ నిర్మాణం జరగాలి. సైద్ధాంతిక పునాది ఉండాలని.. ఆ మేరకు పార్టీ నిర్మాణం ఉంటుందని కవిత చెప్పారు. ఆడవాళ్లు అని అవమానించొద్దు. షర్మిల ఈరోజు ఏపీలో ఒక జాతీయ పార్టీకి అధ్యక్షురాలిగా ఉన్నారు. షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టడం ఇక్కడ ప్రజలకు నచ్చలేదు. చిరంజీవి పార్టీ పెట్టి మూసివేయలేదా..? నా లైన్లో నేను వెళ్తున్నా.. నా ప్రయత్నం నాది. తెలంగాణ వాదమే మా పార్టీ మొదటి లైన్ అని కవిత స్పష్టం చేశారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు కింది స్థాయి నుంచి వచ్చిన వాళ్లు కేంద్ర మంత్రులు అయ్యారు. కొత్త తరానికి పెట్టబోయే పార్టీలో అవకాశం ఉంటుందని కవిత చెప్పారు

## కార్పొరేషన్ విభజనపై నోటీసులు




**హైదరాబాద్ :** జీహెచ్ఎంసీ విభజనను వ్యతిరేకిస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. కేంద్రం జారీ చేసిన సర్క్యులర్‌కు విరుద్ధంగా జీహెచ్ఎంసీని విభజించారని పేర్కొంటూ ఓ వ్యక్తి.. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని హైకోర్టులో సవాల్ చేశారు. జనగణన ముగిసేవరకు జీహెచ్ఎంసీ విభజనపై స్టే ఇవ్వాలని పిటిషనర్ కోర్టుకు విజ్ఞప్తి చేశారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు ఇస్తూ విచారణను వాయిదా వేసింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ( జీహెచ్ఎంసీ )ని విభజించి 3 కార్పొరేషన్లుగా ఏర్పాటు చేస్తూ.. ఇటీవలె రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. దీంతో జీహెచ్ఎంసీతోపాటు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ), సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ)లను కొత్తగా ఏర్పాటు చేసింది. అయితే ఈ విభజనకు వ్యతిరేకంగా హైదరాబాద్‌కు చెందిన గురువారెడ్డి అనే బిజినెస్‌మెన్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. నిబంధనలకు విరుద్ధంగా జీహెచ్ఎంసీని విభజించారని.. దీనిపై స్టే విధించాలని కోరారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇటీవలె జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజిస్తూ జీవో నంబర్ 55 జారీ చేసింది. ఈ జీవో నంబర్ 55ను సవాల్ చేస్తూ గురువారెడ్డి హైకోర్టుకెక్కారు. కేంద్ర ప్రభుత్వం 2027లో జనాభా లెక్కలు చేపట్టనుంది. ఈ నేపథ్యంలోనే ఈ జనాభా లెక్కలకు సంబంధించి కేంద్రం జారీ చేసిన సర్క్యులర్‌కు ఈ జీహెచ్ఎంసీ విభజన విరుద్ధమని పిటిషనర్ వాదించారు. అదే సమయంలో దేశంలో జనగణన పూర్తి అయ్యే వరకు ఈ జీవో నంబర్ 55పై స్టే విధించాలని హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. జనగణన పూర్తయ్యే వరకు జీహెచ్ఎంసీని విభజించకుండా ఇంతకుముందు ఎలా ఉందో అలాగే యథావిధిగా ఉంచాలని హైకోర్టుకు విన్నవించారు. పిటిషనర్ వాదనలను పరిగణలోకి తీసుకున్న హైకోర్టు.. అటు కేంద్ర ప్రభుత్వంతోపాటు.. ఇటు రాష్ట్ర ప్రభుత్వానికి కూడా నోటీసులు జారీ చేసింది. ఈ జీహెచ్ఎంసీ విభజనకు సంబంధించి దాఖలైన పిటిషన్‌పై తర్వాతి విచారణను 3 వారాలకు వాయిదా వేస్తూ కోర్టు నిర్ణయం వెల్లడించింది

# సిద్దిపేట యువతకు ఉచిత ఆన్లైన్ కోచింగ్ అందించే లక్ష్యం

## హరీష్ అన్న ఉద్యోగ యాప్ ప్రారంభం




**సిద్దిపేట :** మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు శుక్రవారం హరీష్ అన్న ఉద్యోగ యాప్ ను ప్రారంభించారు. హరీష్ రావు మాట్లాడుతూ మెడికల్ పారామెడికల్ కాలేజీలు, ఐటీ టవర్తో సిద్దిపేటను అతిపెద్ద ఎడ్యుకేషనల్ హబ్గా మార్చుకున్నాం. వత కేవలం ఉద్యోగాలు చేసేవారిగానే కాకుండా నలుగురికి ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలని అన్నారు. సెల్ ఫోన్లు, ఇతర వ్యసనాలకు బానిస కాకుండా కష్టపడి చదివితే జీవితాంతం సుఖపడతారు. పట్టుదల ఉంటే పేదరికం అడ్డుకాదని..టైలర్, ఆటో డ్రైవర్ల పిల్లలు డాక్టర్లై నిరూపించారు. హైదరాబాద్ వెళ్లి వేలు ఖర్చుపెట్టే బదులు..ఈ ఉచిత యాప్ను వాడుకుంటే మీ జీవితాలకు ఇదే గేమ్ చేంజర్, ఏ పని చేసినా దాంట్లో మంచి ఫలితాలు వచ్చినప్పుడే సంతృప్తి కలుగుతుంది. ఈ యాప్ ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి చరిత్ర ఉంది. ఇక్కడ కేసీఆర్ చదువుకున్నారు. ఒక రాష్ట్రాన్ని సాధించిన నాయకున్ని అందించిన కాలేజ్. ఈ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి అందించిన కాలేజ్ ఇది. నాక్ లో సిద్దిపేట డిగ్రీ కాలేజీకి ఏ గ్రేడ్ రావడానికి సిబ్బంది, ప్రిన్సిపల్ చాలా కృషి చేశారు. ఈ కాలేజీ అభివృద్ధికి నందిని సిద్ధారెడ్డి, చుక్కా రామయ్య లాంటి వారు పని చేశారు. సిద్దిపేట డిగ్రీ కాలేజ్ కి తనకున్న అనుబంధాన్ని ఈమధ్య చుక్కారామయ్య కలిసినప్పుడు గుర్తు చేశారు.డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు 95% జాబ్ చేస్తామని 5% మాత్రమే వ్యాపారం చేస్తామని చేతులు ఎత్తారు. అదే గుజరాత్ లాంటి రాష్ట్రంలో వ్యాపారం చేయడానికి 95% ముందుంటారు. ఇంటర్న్ షిప్ కి ఆదరణ పెరిగింది. ఉద్యోగం చేస్తాను కాదు ఉద్యోగం ఇస్తాను అనే ఆలోచనతో మీరందరూ ముందుకు వెళ్లాలని అన్నారు. సిద్దిపేట ఐటి టవర్ లో ఇంకా కొత్త కంపెనీలు కూడా వస్తున్నాయి. ఇక్కడి యువతకు మరిన్ని అవకాశాలు దక్కుతాయి ఎక్కువ మంది యువతులే ఉద్యోగం చేయడం సంతోషం కలిగించిన విషయం. సిద్దిపేట ఒక ఎడ్యుకేషనల్ హబ్. రిజర్వాయర్లకు కూడా సిద్దిపేటనే హబ్. ఆలయాలకు కూడా సిద్దిపేట నిలయం.. పెద్ద పెద్ద నగరాలకు కూడా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లేదు కానీ మన సిద్దిపేటకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఉంది. సిద్దిపేట అంటే ఒకప్పుడు పందులకు ఫేమస్. సిద్దిపేట అంటే ఒక మోడల్ టౌన్ గా డెవలప్ చేసుకున్నాం. రైతుల కోసం గోదావరి నీళ్లు తెస్తే సిద్దిపేటలో లక్ష ఎకరాల్లో పంట పండుతున్నదని అన్నారు.

# మైత్రీవనంలో భారీ అగ్ని ప్రమాదం




**హైదరాబాద్ :** హైదరాబాద్లోని మైత్రీవనంలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. నీలగిరి బ్లాక్లో దుర్ఘటన జరిగింది. దట్టమైన పొగలు వ్యాపించడంతో ఆ ప్రాంతమంతా ఒక్కసారిగా షాక్కి గురైంది. ఏం జరుగుతుందో తెలియక జనం భయంతో పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అధికారులు అక్కడకు వచ్చి మంటలను ఆర్పుతున్నారు. నీలగిరి బ్లాక్లో జరిగిన ప్రమాదంలో కొందరు విద్యార్థులు చిక్కుకున్నారు. నాల్గో అంతస్తులోని ఓ ఇనిస్టిట్యూట్లో చిక్కు కున్న విద్యార్థులను అధికారులు అతి కష్టమ్మీద బయటకు తీసుకొచ్చారు. బాల్కనీ నుంచి వారిని సురక్షితంగా కిందికి దించారు. అమీర్పేటను ఐటీ ఉద్యోగాలకు గుండెకాయగా చెబుతుంటారు.అలాంటి ప్రాంతంలో షార్ట్ సర్క్యూట్ జరగడం అగ్నికీలలు ఎగసిపడటం అందర్నీ ఆందోళనకు గురి చేసింది. వేల మంది విద్యార్థులతో నిరంతరం రద్దీగా ఉండే మైత్రీవనం వాణిజ్య సముదాయంలోని నీలగిరి బ్లాక్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. భవనంలోని నాల్గో అంతస్తులో ఉన్న కోచింగ్ సెంటర్ నుంచి పొగలు రావడంతో అంతా పరుగులు పెట్టారు. ఉదయం సాధారణ పని వేళల్లో మైత్రీవనం సముదాయం ఐటీ నిరుద్యోగులతో కిటకిటలాడుతున్న సమయంలో ప్రమాదం జరిగింది. నీలగిరి బ్లాక్ భవనంలో నాల్గో అంతస్తులో ఉన్న శిక్షణా సంస్థకు సమీపంలో ఉన్న ప్యానెల్లో షార్ట్ సర్క్యూట్ జరిగింది. ఆ దెబ్బకు వైరింగ్ మొత్తం కాలిపోయింది. నిమిషాల వ్యవధిలోనే భవనం మొత్తం దట్టమైన పొగ అలుముకోవడంతో లోప ఉన్న విద్యార్థులు, సిబ్బంది ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు, అభ్యర్థులు కొందరు మెట్ల మార్గంలో బయటకు వచ్చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సబ్బంది యుద్ధ ప్రాతిపదికన ఘటనా స్థలానిక చేరుకున్నారు. భవనం లోపలికి వెళ్లే మార్గాలు పొగతో నిండిపోయాయి. ఆ మార్గాల్లో చిక్కుకున్న బాధితులను తీసుకురావడం ఇబ్బందని గ్రహించి బాల్కనీ ద్వారా వారిని రెస్క్యూ చేశారు. పెద్ద పెద్ద నిచ్చెలను వినియోగించి ఒక్కొక్కర్ని కిందికి దించారు. ఒక వేళ రెస్క్యూ ఆపరేషన్ సమయంలో ఎవరైనా ప్రమాదవశాత్తు కింద పడినా గాయాలు కాకుండా ఉండేందుకు భవనం కింద సేఫ్టీ నెట్లు కూడా ఏర్పాటు చేశారు. విద్యార్థుల ప్రాణాలు కాపాడ టంలో అక్కడే ఉన్న విద్యార్థులు, ఉద్యోగులు, సహాయక చర్యల్లోపాల్గొన్నారు.సహాయక చర్యల సమయంలో అగ్నిమా పక సిబ్బందికి కొన్ని ప్రధాన సవాళ్లు ఎదురయ్యాయి. మైత్రీవ నం భవనం చుట్టూ, కింద భారీగా ఏర్పాటు చేసిన హోర్డింగ్స్ ఇబ్బంది కలిగించాయి. భవనం చుట్టూ వేలాడుతుండటం వల్ల నిచ్చెలు వేయడానికి, చిక్కుకున్న వారిని దించేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. హైదరాబాద్ మెట్రో పాలి టన్ డెలవప్మెంట్ అథారిటీ దీన్ని ఈ భవనాన్ని నిర్మించింది. ఇది 1.8 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇది ఐటీ శిక్షణ కేంద్రాలకు, కో వర్కింగ్ స్పేస్లకు అడ్డాగా ఉంది. ఇక్కడ ప్రతి రోజూ వేలాది మంది అభ్యర్థులు ఐటీ రంగాల్లో ట్రైనింగ్ తీసుకుంటారు. అగ్ని ప్రమాదం జరిగిన నీలగిరి భవనాన్ని అధికారులు మూసివేశారు. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చినా అక్కడ పరిస్థితులు చెక్ చేసి ఎలాంటి ప్రమాదాలు జరగవని నిర్ధారించుకున్న తర్వాతే బ్లాక్ను ఓపెన్ చేస్తామని అధికారులు చెబుతున్నారు. అగ్ని ప్రమాదం జరిగితే ప్రజల ప్రాణాలు సురక్షితంగా రక్షించే పరిస్థితులు ఉన్నాయో లేదో అనే అంశంపై కూడా అధికారులు విచారణ చేయనున్నారు.

# 800 రోజులు పూర్తయినా అమలు కాని ఆరు గ్యారెంటీలు



సిద్దిపేట : సిద్దిపేట పట్టణంలోని 37వ వార్డులో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని మాజీ మంత్రి హరీష్ రావు శుక్రవారం ప్రారంభించారు.

హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సగం కాలం పూర్తయింది. ఆనాడు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, రేవంత్ రెడ్డి అందరూ బాండ్ పేపర్ల మీద రాసిచ్చి 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని హామీలు ఇచ్చారు. కానీ, 100 రోజులు కాదు కదా.. 800 రోజులు పూర్తయినా ఇప్పటికీ ఆరు గ్యారెంటీలు అమలవుతున్న దాఖలాలు లేవని అన్నారు.

ఎస్సీ డిక్లరేషన్ పేరిట దళితులకు 18% రిజర్వేషన్లు, ఎస్సీ సబ్ ప్లాన్ అమలు చేస్తామని మోసం చేశారు. చదువుకునే పిల్లలకు టెన్త్ పాస్ అయితే రూ. 10,000, ఇంటర్ పాస్ అయితే రూ. 25,000, డిగ్రీకి రూ. 50,000, పీజీ చదివితే లక్ష రూపాయలు ఇస్తామని చెప్పి.. ఈరోజు వరకు ఒక్క విద్యార్థికి కూడా ఒక్క రూపాయి ఇచ్చిన పాపాన పోలేదు. కనీసం కేసీఆర్ గారు ఇచ్చిన ఫీజు రీయింబర్స్మెంట్ డబ్బులు కూడా రావడం లేదని అన్నారు.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభకు సిద్దరామయ్య ని తీసుకొచ్చి, బీసీ సబ్ ప్లాన్ అమలు చేస్తామని చెప్పారు. బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తామని, ఏటా రూ. 20,000 కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక బీసీలకు కాంగ్రెస్ పార్టీ మొండిచేయి చూపింది. వరంగల్ సభలో రైతు డిక్లరేషన్ అని చెప్పి రాహుల్ గాంధీ మాయమాటలు చెప్పారు. ఏటా రూ. 15,000 రైతుబంధు, పంటల బీమా, అన్ని పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి రైతులను నిలువునా దగా చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, యువత.. ఇలా అన్ని వర్గాలను మోసం చేసింది. గతంలో అవ్వాతాతలకు కేవలం రూ. 200 ఉన్న పెన్షన్ను కేసీఆర్ రూ. 2,000 చేశారు. కానీ కాంగ్రెస్ నేతలు తాము డిసెంబర్లో గెలిచిన మరుసటి నెల నుంచే రూ. 4,000 ఇస్తామని హామీ ఇచ్చారు. 27 నెలలు గడుస్తున్నా ఆ 4000 పెన్షన్ రాలేదు.

ఈనెల 26న ప్రవేశపెట్టే బడ్జెట్లో బీడీ కార్మికులు, వృద్ధులు, వితంతువులు, ఎయిడ్స్ బాధితులు, గీత మరియు చేనేత కార్మికులందరికీ తక్షణమే రూ. 4,000 పెన్షన్ ఇచ్చేలా నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని, ముఖ్యంగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారిని డిమాండ్ చేస్తున్నాను. మహిళలందరికీ నెలకు రూ. 2,500 చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో వేస్తామని చెప్పి ఓట్లు వేయించుకున్నారు. ఇప్పటిదాకా ఒక్క మహిళకు కూడా ఆ డబ్బులు ఇవ్వలేదు. తక్షణమే ఈ బడ్జెట్లో మహిళలకు నెలకు రూ. 2500 ఇచ్చేలా నిధులు కేటాయించాలని అన్నారు.

గత బడ్జెట్లో అసెంబ్లీలో గొప్పగా స్పీచులు దంచి, బల్లలు చరిచి చెప్పిన పథకాలు ఏవీ అమలు కాలేదు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఇప్పటికీ కూలీలకు డబ్బులు అందలేదు, పంటల బీమా రాలేదు. యువత కోసం ప్రవేశపెడతామన్న రాజీవ్ యువ వికాసం అమలు కాలేదు. ఏ ఒక్క యువతీయువకుడికి ఒక్క రూపాయి కూడా సహాయం చేయలేదు. బడ్జెట్లో చెప్పిన మాటలకు కూడా విలువ లేకుండా చేశారు. కనీసం ఈ బడ్జెట్లైనా వాస్తవాల ఆధారంగా, వాస్తవికతకు దగ్గరగా రూపొందించాలి. రూ. 4000 పెన్షన్, మహిళలకు నెలకు రూ. 2500 ఇచ్చే హామీలను అమలు చేసేలా ఈ బడ్జెట్లో నిధులు పొందుపరచాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నానని అన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు వేసిన సర్పంచ్ బర్ల మధుకర్, కొట్టం మనోహర్



**వాస్తవ నేస్తం,కోటగిరి :** మండల కేంద్రంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. స్థానిక సర్పంచ్ బర్ల మధుకర్ మరియు కొట్టం మనోహర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అర్హులైన లబ్ధిదారుల ఇళ్ల స్థలాల్లో అధికారులు మరియు ప్రజా ప్రతినిధుల సమక్షంలో నిర్మాణానికి సంబంధించి మార్కింగ్ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల జాబితా ప్రకారం, వారి సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి కావాల్సిన కొలతలను తీసుకుని, ప్లాన్ ప్రకారం పునాదుల కోసం మార్కింగ్ వేశారు. సొంత ఇంటి కల నెరవేరబోతుండటంతో లబ్ధిదారులు ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేశారు. నిర్ణీత గడువులోగా నిర్మాణ పనులు పూర్తి చేసేలా సర్పంచ్ మరియు అధికారులు తగిన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, సంబంధిత శాఖల అధికారులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## హార్టెక్ మరియు ఆరోగ్య జ్యోతి ఎన్జీవో ఆధ్వర్యంలో అన్నదానం

### పండ్ల పంపిణీ రక్తదాన శిబిరం





**వాస్తవ నేస్తం,అదిలాబాద్:** ఆదిలాబాద్ లోని రాజీవ్ గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ జనరల్ ఆసుపత్రి లో హార్టెక్ మరియు ఆరోగ్య జ్యోతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పేదలకు పండ్లు మరియు అన్నదాన కార్యక్రమాన్ని ఆరోగ్య జ్యోతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు కే నరేష్ కుమార్ హార్టెక్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు నక్క భారతి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం రిమ్స్ బ్లడ్ బ్యాంకులో రక్తదాన నీ శ్రీకాంత్ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. స్వచ్ఛంద సేవలు చేయడంలో ఆరోగ్య జ్యోతి మరియు ఆర్థిక సాధ్యమ సంస్థలు ఎప్పుడు ముందుంటాయని తెలిపారు. విద్యా వైద్యం వ్యవసాయం ఆరోగ్యంతో పాటు అన్ని రంగాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం సేవా కార్యక్రమాలు చేయడం గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. సేవా కార్యక్రమాలు చేయడంలో రెండు స్వచ్ఛంద సంస్థలు ఎప్పుడు ముందు ఉంటాయని వారు వివరించారు. రాబోయే రోజుల్లో అందరి సహాయ సహకారాల తో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం శ్రీకాంత్ జన్మదిన సందర్భంగా శ్రీకాంత్ రక్తదానం నిర్వహించారు. శ్రీకాంత్ ఇప్పటివరకు ఎన్నో రక్తదానాలు చేయడం జరిగింది. ఆరోగ్య జ్యోతి ఆర్థిక సచిన సంస్థ అధ్యక్షులు శ్రీకాంత్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## సంధ్య థియేటర్ ఘటన ఛార్జ్షీట్ను తిప్పిపంపిన కోర్టు

**హైదరాబాద్ :** సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో ఛార్జ్ షీట్ను నాంపల్లి కోర్టు తిప్పి పంపింది. ఈ కేసులో పోలీసులు అల్లు అర్జున్ సహా 23 మందిపై ఛార్జ్ షీట్ దాఖలు చేసి న విషయం తెలిసిందే. పోలీసులు సమర్పించిన ఛార్జ్ షీట్లో సరైన సాక్ష్యాలు, ఆధారాలు లేవని, సాంకేతిక లోపాలు ఉన్నాయని ఇప్పటికే రెండు సార్లు ఛార్జ్ షీట్ ను కోర్టు తిప్పి పంపింది. దాంతో పోలీసులు మరోసారి సరి చేసి నాంపల్లి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేసారు.

## తెలంగాణ అవుట్ డోర్ మీడియాకు న్యాయం చేయాలి

### తెలంగాణ అవుట్ డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ జిహెచ్ ఎంసి కార్యాలయం ముట్టడి

**హైదరాబాద్ :** తెలంగాణ అవుట్ డోర్ మీడియాకు న్యాయం చేయాలనీ డిమాండ్ చేస్తూ తెలంగాణ అవుట్ డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ ) ఆధ్వర్యంలో శుక్రవారం ఉఊఓఅ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ నిర్వాహకులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ మునిసిపల్ శాఖ ముఖ్యమంత్రి దగ్గర ఉండటంతో మా అసోసియేషన్ కు గత 2 సంవత్సరాల నుండి అపోయింట్మెంట్ లేక ఇబ్బంది పడుతున్నాం మా సమస్యలు పరిష్కరించడానికి అధికారులకు ఎన్ని సార్లు మొర పెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేసారు.ఇప్పుడు ప్రభుత్వం కొత్త పాలసీ తీసుకు వస్తుంది, ఇదిచాలా మంచి విషయం కానీ ఈ పాలసీ వల్ల ఇప్పుడు రాష్ట్రంలో ఉన్న 450 కంపెనీలు రోడ్ మీద పడేసి ఒక మూడు కంపెనీ లకు మాత్రమే వ్యాపార అవకాశాలు కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది.ప్రైవేట్ బిల్డింగ్ పైన ఇప్పుడు ఉన్న వేలాది హోర్డింగ్స్ తీసేసి కొంతమందికే 2,3 కంపెనీలు మాత్రమే వ్యాపారం చేసుకొనే పరిస్థితి కల్పిస్తున్నారు అని వాపోయారు.ఇక్కడ ప్రైవేట్ భవనాల మీద మరియు ప్రైవేట్ భూముల్లో హోర్డింగ్ లు ఏర్పాటు చేసి ప్రభుత్వానికి పన్నులు చెల్లించే వాటిని తొలగించి, ప్రభుత్వ భూముల్లో ఖీ అండ్ ః రోడ్ల మీద ఎలాంటి పన్నులు లేకుండా 2 లేదా 3 ఏజెన్సీ లను ప్రభుత్వం సమర్థిస్తున్నట్లు ఆ పాలసీ వస్తుంది వాఎరు పేర్కొన్నారు. గత ప్రభుత్వం కొంతమంది కోసం ఊ ఔెం. 68 తీసుకొచ్చి సిటీని వాళ్లకు సంబంధించిన వారికి కట్టబెట్టారు. ఇప్పుడు ఈ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోంది అనిపిస్తుంది.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com